క్లుప్తంగా

ఆకాశ దీపం ఏర్పాటు



మద్దిలేటిస్వామి ఆలయంలో ఆకాశ దీపం ఏర్పాటు చేస్తున్న అర్చకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ప్రముఖ పుణ్య క్షేత్రం మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, ప్రధాన అర్చకుడు మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించారు.

గోశాలకు ఆవుల తరలింపు



గోవులను తరలిస్తున్న ట్రాలీ ఆటో

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలో రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న గోవులను గోశాలకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..గోవులను రోడ్లపై వదలరాదని.. వాటిని తీసుకెళ్లాలని ఇప్పటికే చాలా సార్లు గోవుల యజమానులను ఆదేశించినా పట్టించుకోలేదని తెలిపారు. కొద్ది రోజుల నుంచి గోవులను గోశాలలకు తరలిస్తున్నట్లు తెలిపారు. గోవులను రోడ్లపై వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయ పరిసరాల్లో పిచ్చిమొక్కల తొలగింపు



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్: కార్తీక మాసోత్సవాల సందర్భంగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత పనులను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదివారం ప్రారంభించారు. పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. అయ్యప్పస్వామి, దుర్గామాత ఆలయాలకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి భక్తులు, మాలధారులకు అసౌకర్యంగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని శుభ్రపరుస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



గోర్లగుట్ట గ్రామంలో ప్రచారం చేస్తున్న సభ్యులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి– ఇందూ జ్ఞాన వేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడి లేకుండా ప్రశాంత జీవన విధానం కోసం , ఆత్మజ్ఞానం తెలుసుకోవడానికి భగవద్గీత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో నిత్యాన్నదానం



భోజనం చేస్తున్న అయ్యప్ప భక్తులు

డోన్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పాతపేటలోని ద్రోణపురి వీరాంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులతో పాటు భక్తులు, స్థానికులకు నిత్యాన్నదానం ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు



నిర్మాణం చేపట్టాల్సిన మిట్టపల్లె- ఇల్లూరుకొత్తపేట రోడ్డు

బనగానపల్లె: బనగానపల్లె ఆర్‌అండ్‌బీ సెక్షన్ పరిధిలోని మిట్టపల్లె–ఇల్లూరుకొత్తపేట మెయిన్ రోడ్డు వరకు 4.8 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు డీఈఈ సునీల్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి అగ్రిమెంట్ టెండర్లు కూడా పూర్తయ్యాయని.. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

టీకాతో రక్ష

- గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు
- ప్రతి బుధ, శనివారాల్లో ఉచితంగా వాక్సినేషన్
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో..



చిన్నారికి టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అవుకు: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి. అప్పుడే పుట్టిన చిన్నారులకు ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు, వ్యాక్సిన్లు వేయిస్తే వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చు. అయితే చాలా మంది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీకాలపై సరైన అవగాహన లేకపోవడంతో వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లువళ్లు గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ వైద్య సిబ్బంది ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వ్యాక్సిన్లు వేసేది ఇలా

- గర్భిణిగా నిర్ధారణ అయిన మూడు నెలలు నిండిన తరువాత టీటీ ఇంజెక్షన్ వేయించుకోవాలి. నెల వ్యవధిలో మరో టీటీ ఇంజెక్షన్‌తో పాటు ఐరన్ ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్స్ ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోసు వేయించాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధి నుంచి రక్షణ లభిస్తుంది.
- చిన్నారులకు 14 రోజుల వ్యవధిలో టీబీ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- ఆరు, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితోపాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్ల వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు.
- తొమ్మిది నెలల నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ ఓపిని వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి.
- తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతి ఆరునెలలకు ఒకసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.
- 10, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీటీ) వేయించాలి.

టీకాలు తప్పనిసరి



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయాల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతకర వ్యాధుల బారిన పడకుండా చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ టీకాలపై వైద్య సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

–డాక్టర్ యమున, ఉప్పలపాడు పీహెచ్‌సీ, అవుకు

ప్రతి ఇంటికి సమాచారం

టీకా సమయాన్ని ప్రతి ఇంటికి ఆశా వర్కర్ల ద్వారా సమాచారం అందిస్తున్నాం. మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో లేదా అంగన్‌వాడీ సెంటర్లలో టీకా వేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసే రెండు రోజుల ముందే గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే వెళ్లి తెలియజేస్తున్నాం. టీకాల వల్ల కలిగే సత్ఫలితాలను వివరిస్తున్నాం.

–డాక్టర్ వినోద్ కుమార్, ఉప్పలపాడు పీహెచ్‌సీ, అవుకు

రాచర్ల విద్యార్థినికి బాలసాహిత్యం అవార్డు

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఐశ్వర్య మాచిరాజు బాలసాహిత్య పీఠం నుంచి అవార్డు అందుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని చేతుల మీదుగా ఐశ్వర్య నగదు ప్రోత్సాహకం, శాలువా, ప్రశంసాపత్రం అందుకున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి చదువుతున్న ఐశ్వర్య జలమా.. గరళమా అనే కథ రచించి ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని అవార్డు అందుకోవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: పట్టణానికి చెందిన రాధాకృష్ణ స్వీట్ షాపు యజమాని చిదంబరం సహకారంతో ఆదివారం డోన్ వంద పడకల ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, గర్భిణులు, వారి సహాయకులకు రొట్టెలు, గుడ్లు, పప్పు, అరటిపండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ హనీఫ్, ప్రార్థన సమయం సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ

బేతంచెర్ల: మండలంలోని రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవనం గడపాలని సీఐ డి. వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లు, అనుమానితులకు ఎస్‌ఐ రమేష్ బాబుతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ నాగార్జున

అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్యాపిలి: అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జలదుర్గం ఎస్‌ఐ నాగార్జున హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లుగా ఉన్నవారు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. మట్కా, పేకాట ఆడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని భంగం కల్గించరాదని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంటుందని.. హద్దు మీరి ప్రవర్తించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



సౌమ్య చంద్రిక

కోవెలకుంట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటారు. గత సెప్టెంబర్ నెలలో నంద్యాల మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి, పద్మజ ద్వితీయ కుమార్తె సౌమ్య చంద్రిక, పట్టణానికి చెందిన రియా తదస్మా అనే విద్యార్థినులు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. అండర్ 14 విభాగంలో జిల్లాస్థాయిలో రాణించడమే కాకుండా మంగళవారం అన్నమయ్య జిల్లా అనగల్లు క్రీడామైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. విద్యార్థినులను హెచ్‌ఎం అరుణకుమారి, పీఈటీ సువర్ణ, ఉపాధ్యాయినులు ప్రత్యేకంగా అభినందించారు.

ఇరువర్గాలకు చెందిన 13 మందిపై కేసు నమోదు

ప్యాపిలి: మండల పరిధిలోని చిన్నపొదిళ్ల గ్రామంలో గత నెల 31 వ తేదీన జరిగిన దాడి ఘటనలో ఇరువర్గాలకు చెందిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. డోన్ పట్టణానికి చెందిన దూదేకుల రమీజాబీ (రోజాబి)కి ఆంజనేయ స్వామి ఆవహిస్తాడని స్థానికంగా భక్తుల్లో నమ్మకం ఉంది. లాటరీలో వైన్‌షాప్ దక్కించుకున్న టీడీపీ నాయకుడు రాంభూపాల్ గౌడ్ రమీజాబీకి ఇచ్చిన మాట ప్రకారం ఆంజనేయస్వామి ఆలయానికి చిన్నపొదిళ్లలోని తమ ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. అయితే, దీన్ని జీర్ణించుకోలేకపోయిన రాంభూపాల్ గౌడ్ బంధువులు రమీజాబీపై దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదుతో టీడీపీకి చెందిన రమేశ్ గౌడ్, రాంభూపాల్ గౌడ్, రామయ్య గౌడ్, శరత్, సుజాత పై కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకుడు రాంభూపాల్ గౌడ్ ఫిర్యాదు మేరకు రమీజాబీ, భర్త దస్తగిరి, పులిచర్ల వెంకటేశ్, రామాంజనేయులు, రాజేంద్రప్రసాద్, పూజారి ఖాసీం, వసీం, అక్రంపై కేసు నమోదు చేశారు.

యార్డు నిర్మాణంతో తీరిన కష్టాలు



వ్యాపారులు, రైతులతో కిటకిటలాడుతున్న మార్కెట్ యార్డు

బేతంచెర్ల: పట్టణంలో ఆరు నెలల క్రితం వరకు కూరగాయల మార్కెట్ యార్డు లేకపోవడంతో రైతులు రహదారి పక్కన వర్షానికి తడుస్తూ..చలికి వణుకుతూ తీవ్ర ఇక్కట్లు పడేవారు. చీకటిలోనే వ్యాపారాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రైతుల సమస్యలను తెలుసుకుని బేతంచెర్ల సమీపంలోని కొలుములపల్లె రహదారిలో మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేయించారు. దీంతో మార్కెట్ యార్డులో రెండు షెడ్ల నిర్మాణం పూర్తి కావడంతో రైతులందరూ 4 నెలలుగా మార్కెట్ యార్డులో వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. మార్కెట్ యార్డు నిర్మాణంతో రైతుల కష్టాలు తీరాయి.

సౌకర్యంగా ఉంది



నేను కూరగాయల సాగు చేస్తుంటాను. కూరగాయలను తీసుకుని ప్రతి రోజు ఆటోలో బేతంచెర్లకు వస్తుంటాను. గతంలో రోడ్డు పక్కన ఇబ్బందులు పడుతూ వ్యాపారాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో కూరగాయల మార్కెట్ యార్డు నిర్మించారు. ప్రస్తుతం నాలాంటి ఎందరికో సౌకర్యంగా ఉంది.

–రామనాథం, గోరుమానుకొండ ఎంపీటీసీ సభ్యుడు

ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు



గతంలో బేతంచెర్లకు తెచ్చిన కూరగాయలు అమ్మకం జరగకపోతే బనగానపల్లె, డోన్, నంద్యాల, కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కూరగాయల మార్కెట్ యార్డు నిర్మించడంతో నంద్యాల, ఆళ్లగడ్డ, అవుకు, బనగానపల్లె మండలాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

–ఇమాం ఖాశీం, రైతు, బేతంచెర్ల

కష్టాలు తీరాయి



గతంలో బేతంచెర్ల పట్టణంలో రహదారి పక్కన అంతంత మాత్రంగానే వ్యాపారాలు జరిగేవి. దీంతో మిగిలిన కూరగాయలను డోన్, బనగానపల్లె మార్కెట్లకు వ్యయ ప్రయాసల మధ్య తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అక్కడికి వెళ్లిన తరువాత సరైన ధర లభించక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం మండల కేంద్రంలో ఉన్న మార్కెట్ యార్డుతో రైతుల కష్టాలు తీరాయి.

–మద్దిలేటి, ముద్దవరం గ్రామం

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ ఉంటుందని వెల్లడించారు.

6న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కోవెలకుంట్ల/బనగానపల్లె రూరల్: ఐసీడీఎస్ బనగానపల్లె ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి ఈ నెల 6, 7వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల మండలాల్లోని అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీ డోన్ ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. కొలిమిగుండ్ల, సంజామల మండలాల అభ్యర్థులకు ఈ నెల 7వ తేదీ నంద్యాల ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులకు ఇప్పటికే కాల్ లెటర్లు పంపినట్లు తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

5న చలో విజయవాడ

బేతంచెర్ల: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 5వ తేదీ చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య అన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు.

క్రిప్టో కరెన్సీ నిందితుడి అరెస్ట్?

డోన్ టౌన్: లక్ష పెట్టుబడి పెడితే ప్రతి నెలా రూ.8 వేలు అంటూ పలువురి వద్ద నుంచి కోట్ల రుపాయాలు వసూలు చేసిన నిందితుడు రామాంజనేయులను పోలీసులు ఆదివారం అరెస్టు చేసినట్లు పట్టణంలో ప్రచారం జరిగింది. ఈ విషయంపై పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషాను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని తెలిపారు. విచారణ చేస్తున్నట్లు చెప్పారు. బాధితులు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని చెప్పడం గమనార్హం.

తైక్వాండోలో విద్యార్థుల సత్తా



ప్రతిభ చాటిన విద్యార్థులతో కోచ్

బేతంచెర్ల: కర్నూలు వెంకటేశ్వర్‌నగర్‌లోని విజేత ఉన్నత పాఠశాలలో అమెచ్యూర్ తైక్వాండో అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన హయ్యర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో బేతంచెర్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. మనస్విని, వినయ్, దినేష్, దివ్యశ్రీ, యుతైజ్ కుమార్, పూర్ణేంద్ర, యశ్వంత్, పవనశ్రీ, రిషిక, రోహన్, తనుశ్రీ రెడ్‌వన్, రెడ్‌బెల్ట్, బ్లూవన్, బ్లూ, గ్రీన్‌వన్, గ్రీన్ బెల్టు సాధించారన్నారు. విద్యార్థులు బ్లాక్ బెల్ట్ లక్ష్యంగా పెట్టుకుని సాధన చేయాలని కోచ్ నాగన్న సూచించారు.

బాబోయ్ దొంగలు

- డోన్‌లో వరుస చోరీలు

డోన్ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొద్ది రోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సెప్టెంబర్ నెలలో పాత బస్టాండ్, రాజా టాకీస్ తదితర ప్రాంతాల్లోని మెడికల్ షాపుల్లో చోరీలు జరిగాయి. అక్టోబర్ 24వ తేదీ మరోసారి పాత బస్టాండ్‌లోని మంజునాథ మెడికల్ స్టోర్‌లో దొంగతనానికి ప్రయత్నిస్తున్నట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఇదే కోవలో శనివారం అర్ధ రాత్రి పాత బస్టాండ్ సమీపంలోని ఒక సెల్‌ఫోన్ షాప్, దొడ్ల డెయిరీ, బసయ్య కిల్లీకొట్టు, శివ మెడికల్ షాపు, కూరగాయల మార్కెట్ మరో నాలుగు దుకాణాలతో పాటు రైల్వేగేట్ల సమపంలోని శేఖర్ కిరాణ దుకాణం, పాతపేటలోని ఐదు షాపుల్లో చోరీకి విఫలయత్నం చేసినట్లు తెలిసింది. షాపులకు ఉన్న షటర్ల తాళాలు పగులగొట్టి తెరవడానికి ప్రయత్నించారు. పాత బస్టాండ్‌లోని సెల్‌ఫోన్ దుకాణంలో రూ.2 వేల నగదుతో పాటు రిపేరు కోసం వచ్చిన నాలుగు పాత సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. అలాగే రైల్వేగేట్ల సమీపంలోని శేఖర్ షాపులో రూ.200 చిల్లర నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీసులను వివరణ కోరగా కార్తీక మాసం సందర్భంగా వివిధ పుణ్యా క్షేత్రాలకు బందోబస్తు కోసం పోలీసులు వెళ్లారని, అదే విధంగా శనివారం ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లె వద్ద వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కోసం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు తరలిరావడంతో బందోబస్తుకు వెళ్లడంతో నిందితులు చోరీలకు పాల్పడి ఉండవచ్చని తెలిపారు. బాధితులు ఎవరూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని, దొంగలను గుర్తించడానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఇదో రకం పిచ్చి..!



ద్విచక్ర వాహనంపై 'పత్తికొండ ఎమ్మెల్యే తాలుకా'



ధర్మవరం సుబ్బారెడ్డి గారి తాలుకా



భవిష్యత్తు సీఎం అని రాయించుకున్న దృశ్యం

డోన్: కొందరు యువకుల చేష్టలు విపరీత అనర్థాలకు దారితీస్తున్నాయి. ద్విచక్రవాహనాల నంబర్ ప్లేట్‌ల స్థానంలో ఫలానా తాలుకా అంటూ బోర్డులు తగిలించుకోవడం.. ఏదో ఘనకార్యం చేసినట్లు దూసుకుపోవడం ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. ఇటీవల కాలంలో పలువురు రాజకీయ నాయకులకు సంబంధించిన పేర్లు వేసుకుని తిరగడం ఎక్కువయ్యాయి. డోన్ పట్టణంలో కొందరు సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి తాలుకా అని, మరికొందరు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తాలుకా అని, ఇంకొందరు కాబోయే సీఎం జూనియర్ ఎన్టీఆర్ తాలుకా అని నేమ్‌ప్లేట్లు రాయించుకుని రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ నంబర్లు ఉండేచోట ఫలానా వ్యక్తి తాలుకా అని తాటికాయ అంత అక్షరాలతో రాసుకుని తిరుగుతుండటంపై ప్రజలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ఇలాంటి వెర్రి మరింత ముదిరిపోకముందే పోలీసు, ఆర్టీఓ అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



కృష్ణానదిలో బోటులో ప్రయాణిస్తూ ఘాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

శ్రీశైలంప్రాజెక్ట్: కార్తీకమాసంలో వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సున్నిపెంట పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రామాంజినాయక్ ఆదేశించారు. ఆదివారం ఆయన సీఐ జి.చంద్రబాబు, సిబ్బందితో కలిసి శ్రీశైలండ్యాం, వ్యూ పాయింట్, లింగాలగట్టు లోలెవెల్, హైలెవెల్ ఘాట్లను పరిశీలించారు. కృష్ణానదిలో పర్యటించారు. భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలని, కృష్ణానది ఘాట్ల వద్ద నిరంతర నిఘా ఉంచి భక్తులకు నదిలో ప్రమాదాలు జరుగకుండా చూడాలని టూటౌన్ పోలీసులకు సూచించారు. కార్తీక మాసాంతం వరకు ఇద్దరు ఎస్‌ఐలు, ఐదుగురు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ, ఇద్దరు బ్లూక్యాట్ పోలీసులు రౌండ్ ద క్లాక్ పనిచేయాలని ఆదేశించారు.

కొలనుభారతి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి



ఆలయ సిబ్బంది, పురోహితులతో మాట్లాడుతున్న కాకనూరు శారదాపీఠం పీఠాధిపతి

కొత్తపల్లి: రాష్ట్రంలో ఎంతో పవిత్రమైన ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి దేవి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని కాకనూరు శారదాపీఠం పీఠాధిపతి శివ యోగేంద్ర సరస్వతి అన్నారు. ఆదివారం ఆయన కొలనుభారతిదేవి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్ర పవిత్రత, ప్రతిష్టతకు భంగం కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు సూచించారు. క్షేత్ర పరిధిలో అనధికార పూజలను అడ్డుకోవాలన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, పూజల పేరుతో అధిక మొత్తం వసూలు చేయరాదన్నారు. ఆయన వెంట విశ్వహిందూ పరిషత్ నాయకులు వాసుదేవ రెడ్డి ఉన్నారు.

ఎస్‌టీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఎస్‌టీటీఎఫ్ (షెడ్యూల్, ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్) కార్యాలయంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గోర్ల సుధాకర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ నియమించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కేశాలునాయక్, జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాము, వైస్ ప్రెసిడెంట్ దేవేంద్రుడు, రాంబాలాజీనాయక్, తిక్కస్వామి, విజయ్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్, అడిషనల్ సెక్రటరీగా పక్కీరయ్య, సెక్రటరీగా రవీంద్రబాబు, నాగలక్ష్మి, శోభారాణి, రమేష్‌నాయక్, చంద్రమోహన్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.